# ఆన్‌లైన్ వైద్యసేవలు గ్రామీణులకు వరం : ఎం.ఎల్.ఎ.

**కొల్లూరు, (న్యూస్‌టుడే) :** వైద్యం అత్యంత ఖరీదైన తరుణంలో గ్రామీణులకు ఆన్‌లైన్ ద్వారా వైద్యసేవలు అందించటం బృహత్తర కార్యక్రమమని వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం కొల్లూరు మండల పరిధిలోని జువ్వలపాలెంలో పరివర్తనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజినిటి గ్లోబల్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్లోకేర్ టెలీ వైద్యకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యంత ఖరీదైన వైద్య సదుపాయాలను పేదలకు అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా వైద్య సేవలు అందేలా కేంద్రాన్ని ఏర్పరచటం గ్రామీణుల పాలిట వరం అన్నారు. పల్లెటూళ్లల్లో సాంకేతిక విద్యను అందించేందుకు తొలి సారిగా జువ్వలపాలెంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన పరివర్తనా ఫౌండేషన్ రైతుల కష్టాలు తీర్చేందుకు గిడ్డంగులు నిర్మించటంతో తమ సహాయ కార్యక్రమాలకు మరింత ముందుగు వెళ్లటం హర్షణీయం అన్నారు. విజినిటి గ్లోబల్ లిమిటెడ్, పరివర్తనా ఫౌండేషన్‌కు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రేపల్లె మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, అమెరికాలో అమలవుతున్న విధానాన్ని భారతదేశంలోని మారుమూల పల్లెలకు తీసుకురావటం వెనుక పరివర్తనా ఫౌండేషన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. విద్యార్థి దశలోనే ఫౌండేషన్ నిర్వహిస్తున్న మండవ హర్షవర్ధన్ ను ఆయన అభినందించారు. అనంతరం విజినిటి గ్లోబల్ లిమిటెడ్ వ్యవస్థాపకులు అనురాగ్‌జైన్ మాట్లాడుతూ తొలి సారిగా ఒక్క కేంద్రంతో ప్రారంభం అయిన తమ ప్రస్థానం ముందుకు తీసుకువెళ్లటానికి ప్రజల సహాయ సహకారాలు అవసరం అన్నారు. పేదలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన టెలీ వైద్యకేంద్రాల సంఖ్య పెంచి మరిన్ని ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఇందుకు తమ కేంద్రం పనితీరులో చేయాల్సిన మార్పులను ప్రజల నుంచి సలహాలు సేకరించి అమలు సేస్తామన్నారు. అనంతరం ఆనందబాబు కేద్రాన్ని ప్రారంభించారు. తొలి సారిగా టెలీ వైద్య కేంద్రంలో విజయవాడలో ఉన్న డాక్టర్ల ద్వారా ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎం.పి.పి. మైనేని మురళీకృష్ణ, జువ్వలాపాలెం మాజీ సర్పంచి శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



**వైద్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎం.ఎల్.ఎ. ఆనందబాబు**